అభివృద్ధి పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటిలోని వివిధ వార్డుల్లో నెల కొన్న సమస్యలను పరిష్కరించేందుకు వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. శుక్రవారం 9, 15, 17వ వార్డుల్లో సుమారు రూ. 53 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి, డీఈఈ చిరంజీవులు, కౌన్సిలర్లు మాదిరెడ్డి నరసింహారెడ్డి, స్వప్న హరిగౌడ్, గోగుల సరితావెంకటేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు



కీసర: చీర్యాలలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామిని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన కమిషనర్ నాగమణికి ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన స్వామివారికి కమిషనర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిషనర్ నాగమణికి వేదపండితులు స్వామి వారి ప్రసాదంతో పాటు స్వామి ఆశీర్వచనాలను అందజేశారు. ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ కమిషనర్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన



ఘట్‌కేసర్: రెడ్ రిబ్బన్ క్లబ్ విజేతలుగా నిలిచిన అంకుషాపూర్‌లోని సాంఘిక సంక్షేమ ఇబ్రహీంపట్నం గురుకుల కళాశాల విద్యార్థినులను ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక శుక్రవారం అభినందించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రెడ్ రిబ్బన్ క్లబ్ క్రీడా పోటీల్లో కళాశాలకు చెందిన చలన పరుగు పందెంలో మొదటి బహుమతి, పోస్టర్ తయారీ పోటీలో హరిణి, దయాన తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. క్రీడా విజేతలతో పాటు నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థి ఛాయకు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

ఘనంగా 'మున్సిపల్' గణనాథుడి నిమజ్జనం



వినాయకుడిని ఊరేగిస్తున్న సిబ్బంది

మేడ్చల్: మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని మున్సిపల్ సిబ్బంది శుక్రవారం ఘనంగా నిమజ్జనం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ దీపికానర్సింహారెడ్డి సిబ్బందితో కలిసి పూజలు చేయగా సిబ్బంది పట్టణంలో ఘనంగా మేడ్చల్ పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఆటపాటలతో సందడి నెలకొంది. కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



మల్కాజిగిరి: మల్కాజిగిరి సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరికి మల్కాజిగిరి చౌరస్తాలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు కోమటి రవి మాట్లాడుతూ.. పార్టీ పోరాట యోధుడిని కోల్పోయిందన్నారు. ఆయన మార్గదర్శకంలో ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కృపాసాగర్, ఇతర పార్టీ నాయకులు నర్సింహగౌడ్, గిరి, కరణంగోపి, చంద్రశేఖర్, లక్ష్మణ్, కొండల్, మంగ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



పార్కులో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వినాయక్‌నగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏక్ పేడ్ మాకే నామ్ పిలుపు మేరకు హార్టికల్చర్ డిపార్టుమెంట్ వారు వినాయక్‌నగర్ డివిజన్ ఆనంద్‌బాగ్ పార్కులో అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పాల్గొని అధికారులతో కలిసి మొక్కలను నాటారు. హార్టికల్చర్ మేనేజర్ మహేశ్వరి, సూపర్ వైజర్ వెంకటేష్, కాలనీవాసులు జాయింట్ సెక్రటరీ రవికుమార్, సెక్రటరీ జయకుమార్, ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావు, కోశాధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మహా నిమజ్జనానికి సర్వం సిద్ధం

17 చెరువుల్లో ఇప్పటి వరకు 10,204 విగ్రహాల నిమజ్జనం

- చెరువుల వద్ద పర్యవేక్షణకు పురపాలక కమిషనర్లు, రెవెన్యూ అధికారులు
- ప్రతి చెరువు వద్ద 2 క్రేన్లు, ఇద్దరు గజ ఈతగాళ్లు
- 10 మంది సిబ్బందితో సహాయక చర్యలు
- భక్తులకు అన్ని వసతులను కల్పించాం
- 2 వేల మంది పోలీసులతో బందోబస్తు
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్





చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి.

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువు వద్ద గణేష్ మహా నిమజ్జన కార్యక్రమం వైభవంగా, ప్రశాంతంగా జరిగేలా అధికార యంత్రాంగం సర్వం సిద్ధమైంది. భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తల్తెకుండా అన్ని వసతులను కల్పిస్తోంది. ఈ నెల 7న గణనాథులు కొలువుదీరగా మంగళవారం వినాయక నిమజ్జన కార్యక్రమం కనుల పండుగలా జరిగేలా పటిష్ట చర్యలను తీసుకున్నారు. 17 చెరువుల వద్ద గణేష్ నిమజ్జన కార్యక్రమం ఇప్పటి వరకు ప్రశాంతంగా కొనసాగుతుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ప్రతి చెరువు వద్ద రెండు క్రేన్లు ఏర్పాటు చేయటంతోపాటు ఇద్దరు గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచారు. చెరువుల వద్ద విద్యుత్ లైటింగ్, మంచినీటి వసతితోసహా 10 మంది సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పోలీసు పికెట్, మెడికల్ క్యాంపు, ఫైర్ ఇంజన్, విద్యుత్ సౌకర్యాలను కల్పించారు. భక్తులకు టాయ్‌లెట్లు వంటి కనీస వసతులను కల్పించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని చెరువుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

వినాయక నిమజ్జనోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 17 చెరువుల వద్ద ప్రత్యేక అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్ గౌతమ్ బాధ్యతలను అప్పగించారు. నిమజ్జన ప్రాంతాలలోని చెరువులను జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ, ఆర్డీఓలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువుల్లో జీహెచ్ఎంసీ పరిధిలో 11 ఉండగా, మిగతా ఆరు చెరువులు పురపాలక సంఘాలు, జీపీల పరిధిలో ఉన్నాయి.



నిమజ్జన ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

నిమజ్జన చెరువులివే...

జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమానికి గుర్తించి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన చెరువులు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మేడ్చల్ మండలంలో సుతారి చెరువు, పెద్ద చెరువు, బాచుపల్లిలో ప్రతాపగిరి ట్యాంకు, ఉప్పల్‌లో నల్లచెరువు, కుత్బుల్లాపూర్‌లో వెన్నెల గడ్డ చెరువు, పరికి చెరువు, కూకట్‌పల్లిలో ఐడీఎల్ ట్యాంకు, సూరారం చెరువు, లింగం చెరువు, బాలానగర్‌లో హస్మత్‌పేట్ బొవెన్ చెరువు, శామీర్‌పేట్ మండలంలో శామీర్‌పేట చెరువు, మల్కాజిగిరిలో సఫల్‌గూడ ట్యాంకు, అల్వాల్‌లో కొత్త చెరువు, ఘట్కేసర్‌లో ఏదులాబాద్ చెరువు, కాప్రాలో చర్లపల్లి చెరువు, కాప్రా చెరువు, కీసరలో రాంపల్లి చెరువులలో గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా మూడు ఫీట్ల నుంచి మొదలుకొని ఐదు ఫీట్ల వినాయక విగ్రహాలు దాదాపు 31,775 ప్రతిష్ఠించినట్లు అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. గణేష్ నిమజ్జన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం (ఏడోవ రోజు) వరకు నిర్దేశించిన చెరువుల్లో భక్తులు 10,204 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. గతేడాది వినాయక ఉత్సవాల్లో భాగంగా 17 చెరువుల్లో 29,875 వినాయక విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు. ఇందులో ఐదు ఫీట్లకు పైన ఉన్న వినాయక విగ్రహాలు 7,879 ఉండగా, ఐదు ఫీట్ల కంటే తక్కువగా మిగతా వినాయక విగ్రహాలు ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఘట్‌కేసర్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రతాపసింగారం గ్రామానికి చెందిన సాయికుమార్‌కు చెక్కును మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అందజేశారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 60 వేలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో నేతలు కుమార్, మాజీ ఉప సర్పంచ్ అబేదా తదితరులు పాల్గొన్నారు.

108లో ఉద్యోగ అవకాశాలు

మేడ్చల్: గుండ్లపోచంపలిలో ఈఎంఆర్ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ 108లో కాల్ సెంటర్‌లో పనిచేసేందుకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రాడ్యుయేట్లు, అండర్ గ్రాడ్యుయేట్లు పోస్టులకు అర్హులని తెలిపారు. వివరాలకు ఫోన్స్: 92461 71575, 95505 20402లలో సంప్రదించాలని కోరారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

మేడ్చల్: పట్టణంలోని 9వ వార్డులో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర పర్సన్ దీపిక నర్సింహారెడ్డి కౌన్సిలర్ లావణ్య హన్మంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. గిర్మాపూర్‌లో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులకు ఆమె పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. కమిషనర్ నాగిరెడ్డి, డీఈ విజయలక్ష్మీ, నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చెంగిచర్ల కబేళాపై ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: చెంగిచర్ల కబేళా నుంచి వచ్చే కాలుష్యం వల్ల నారపల్లి, పోచారం, అన్నోజిగూడ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు, జడ్పీ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి దృష్టికి పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి శుక్రవారం తీసుకెళ్లారు. కబేళా నుంచి వచ్చే వ్యర్థాలు నారపల్లిలోని పెద్ద చెరువులో కలవడంతో నారపల్లితో పాటు పోచారం, అన్నోజిగూడ ప్రాంతాలకు దుర్వాసన వ్యాపిస్తోందని చెప్పారు. దీంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరడంతో శరత్ చంద్రారెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కౌన్సిలర్ రవి, నాయకులు శేఖర్, నర్సింహ, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టు

కీసర: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ నివాసానికి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నేతలు నాయకులు తరలిరావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఆ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్‌రాజు పిలుపు నేపథ్యంలో పోలీసులు శుక్రవారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతోపాటు, కీసర మండలంలోని బీఆర్ఎస్ నేతలను ముందస్తు అరెస్టులు, మరి కొంత మందిని హౌస్ అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణితాశ్రీకాంత్‌గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను గాలికి వదలిపెట్టి ప్రతిపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఇతర పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను బెదిరించి తమ పార్టీలోకి తీసుకోవడం, పార్టీలో చేరని వారిని కేసులు పెట్టి, బెదిరించే సంస్కృతిని కాంగ్రెస్ మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ నేతలు సాయినాథ్‌గౌడ్, నర్సింహ్మగౌడ్, నరహరిరెడ్డి తదితరులు పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఉన్నారు.

ఘట్‌కేసర్‌లో...

ఘట్‌కేసర్: బీఆర్ఎస్ నాయకులపై దాడికి నిరసనగా ఆందోళన చేపట్టడానికి బయల్దేరిన బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్ష, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కొండల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిర్లను ఘట్‌కేసర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మేడ్చల్: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి నివాసంలో బీఆర్ఎస్ జిల్లా సమావేశం ఏర్పాటు చేస్తున్నామని జిల్లాలోని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేలు హాజరు కావాలని బీఆర్ఎస్ అధిష్టానం పిలుపునివ్వడంతో నాయకులు ఆ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్‌లు చేశారు. శుక్రవారం ఉదయం పోలీసులు బీఆర్ఎస్ నాయకులను వారి ఇళ్ల వద్ద అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



హౌస్ అరెస్ట్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి



హౌస్ అరెస్టులో దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణితగౌడ్



ఘట్‌కేసర్ పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే హౌస్ అరెస్ట్...

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బీఆర్ఎస్ కార్యక్రమానికి వెళ్లకుండా ఆయనను బోయిన్‌పల్లిలోని ఆయన నివాసంలో పోలీసులు నిర్బంధించారు. ఉదయమే మల్లారెడ్డి నివాసానికి పోలీసులు వెళ్లి ఆయనను ఇంటి నుంచి బయటకు రానివ్వలేదు. అరెస్టయిన నాయకుల్లో భాస్కర్‌యాదవ్, దయానంద్ యాదవ్, సందీప్‌గౌడ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

'డబుల్' ఇళ్ల సమస్యలు పరిష్కరించండి



జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

మేడ్చల్: దుండిగల్ మున్సిపాలిటీలోని డి.పోచంపల్లిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు బీహెచ్‌కేడిగ్నిటీ హౌసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు పూడూరులోని ఆయన నివాసంలో ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. కాలనీలో మంచి నీటి కొరత ఉందన్నారు. ఎలక్ట్రిక్ మోటార్లు ఏర్పాటు చేయాలని, సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. ఎంపీ ఈటల నగరపాలక సంస్థ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్ఎండబ్ల్యుఎస్ అధికారి అశోక్‌రెడ్డి లతో ఫోన్‌లో మాట్లాడి నాలుగు రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారులు సానుకూలంగా స్పందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ శాంతి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ విగ్నేశ్వర కాలనీలో ఏకదంత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మేయర్ శాంతికోటేష్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేతలు కోటేష్‌గౌడ్, మల్లారెడ్డి, సుబ్రహ్మణ్యం, ప్రేమ్‌రాజ్, యూత్ కమిటీ సభ్యులు ప్రదీప్, ప్రసన్న, బన్నీ, కరుణాకర్, ప్రవీణ్, మ్యాక్స్ విజన్ మార్కెటింగ్ మేనేజర్ మహేందర్, కౌన్సిలర్ శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం లయన్స్ క్లబ్ గ్రేటర్ బంజారా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. బీసీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ స్వామి ప్రారంభించారు. అనంతరం సోమాజిగూడ యశోద ఆస్పత్రి, సెంటర్ ఫర్ సైట్ ఆస్పత్రి వైద్యులు మున్సిపల్ సిబ్బంది, ప్రజలకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు హేమంత్‌రెడ్డి, బాలరాజ్, జైపాల్‌రెడ్డి, పెంటయ్య, లయన్స్ క్లబ్ గ్రేటర్ బంజారా అధ్యక్షులు సంతోష్‌కుమార్, వ్యవస్థాపకులు మణికొండ రమేష్, కో ఆర్డినేటర్ ప్రవీణ్, వైద్యులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఆధీనంలోకి జైజవాన్ షాపింగ్ కాంప్లెక్స్!

కాప్రా: ఆ షాపింగ్ కాంప్లెక్స్ పై దశాబ్ద కాలంగా అనేక ఫిర్యాదులు, మరెన్నో వినతులు, ఇంకెన్నో డిమాండ్లు. వాటన్నింటికీ ఎట్టకేలకు మోక్షం లభించింది. వివరాలివీ... ఏఎస్‌రావునగర్ డివిజన్ జైజవాన్ కాలనీలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ఎట్టకేలకు జీహెచ్ఎంసీ ఆధీనంలోకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను శుక్రవారం జీహెచ్ఎంసీ ఎస్టేట్ విభాగం అధికారులు పరిశీలించారు. ఇక త్వరలోనే సదరు షాపింగ్ కాంప్లెక్స్ వారి ఆధీనంలోకి వెళ్తున్నట్లు సమాచారం.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పోచారం: పోచారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టినందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జోడిమెట్ల క్రాస్ రోడ్, అన్నానగర్, కాకతీయనగర్, డాక్టర్స్ కాలనీ, అరుంధతి, స్వర్ణగిరి, వైష్ణవి కాలనీలు, చౌదరిగూడ గ్రామ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

మేడ్చల్: మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలో బాలాజీనగర్ ఫీడర్‌లో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శనివారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. బాలాజీనగర్, చంద్రానగర్, ఎంఆర్ఆర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, కృపా కాలనీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ అనంతసరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల వల్ల ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అనంతసరస్వతీనగర్, షిరిడీనగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో, 11 కేవీ ఎస్ఎండీసీ కాలనీ ఫీడర్ పరిధిలో కల్యాణ్‌నగర్, ఎస్ఎండీసీ కాలనీ, ఆనంద్‌బాగ్ ఈస్ట్, బ్యాంక్ కాలనీ, తాళ్లబస్తీ, 11 కేవీ ఆర్‌కేనగర్ ఫీడర్ పరిధిలో ఆర్‌కేనగర్, చాణుక్యపురి, ఆనంద్‌బాగ్ వెస్ట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

స్వచ్ఛ బోడుప్పల్ సాధనకు నడుం బిగిద్దాం

బోడుప్పల్: పరిసరాల పరిశుభ్రతతోపాటు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ బోడుప్పల్ సాధన కోసం నడుం బిగిద్దామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ పిలుపునిచ్చారు. బోడుప్పల్‌లో శుక్రవారం నూతనంగా కొనుగోలు చేసిన స్వచ్ఛ ఆటోలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారంను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. పరిశుభ్రంగా ఉందాం, ప్రగతిని సాధిద్దామని పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు



నాగారం మున్సిపల్ వెస్ట్‌గాంధీనగర్ కాలనీలో...



నాగారంలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న నరేందర్‌రెడ్డి

కీసర: కీసర మండలంలోని వివిధ గ్రామాలతో పాటు, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నాగారం మున్సిపల్ పరిధిలోని వెస్ట్‌గాంధీనగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామివారికి 21 రకాల నైవేద్యాలను (ప్రసాదాలను) సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులోని సాయిశ్రీజకాలనీలో ప్రతిష్ఠించిన గణేషుడి విగ్రహం వద్ద స్వామివారి లడ్డూ వేలంపాట గురువారం రాత్రి నిర్వహించారు. వేలంపాటలో కాలనీకి చెందిన దాసరి నరేందర్‌రెడ్డి రూ. 61 వేలకు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, సుమిత్రసురేష్ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ హిత గణపతి నిమజ్జనం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పర్యావరణ హిత విత్తన గణపతిని శుక్రవారం చిన్నారులు నిమజ్జనం చేశారు.

రోడ్డు పనుల పరిశీలన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హెచ్ఎండిఏ నిధులతో చేపట్టిన పీర్జాదిగూడ, పర్వతాపూర్ రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం మేయర్ అమర్ సింగ్, హెచ్ఎండీఏ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్, యాసారం మహేష్, తవిటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387